తెలంగాణకు రెండు స్వర్ణాలు

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న 2వ ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో గురువారం తెలంగాణ రెండు స్వర్ణాలతో సత్తా చాటింది. పారా టేబుల్ టెన్నిస్ (టీటీ) ఈవెంట్‌లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారిణులు విజయదీపిక, నిషా బంగారు పతకాలతో మెరిశారు. గురువారం టీటీ క్లాస్-8 ఈవెంట్ ఫైనల్‌లో నిషా ఇన్నాని.. 3-1తో సవిత (కర్నాటక)పై విజయం సాధించి స్వర్ణం గెలుచుకుంది. క్లాస్-4 విభాగంలో గంగపట్నం విజయదీపిక.. 3-0తో ఉషా రాథోడ్ (గుజరాత్)పై గెలిచి పసిడి నెగ్గింది. ఈ క్రీడల్లో తెలంగాణ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలతో ఏడు పతకాలు సాధించి పాయింట్ల పట్టికలో 11వ స్థానంలో నిలిచింది.

రీతికాకు రజతం

కాంస్యాలు గెలిచిన ముస్కాన్, మాన్సీ

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో మహిళా రెజ్లర్లు దుమ్మురేపారు. గురువారం ఇక్కడ జరిగిన మహిళల 76 కిలోల విభాగంలో యువ రెజ్లర్ రీతికా హుడా రజతం దక్కించుకోగా 59 కిలోల కేటగిరీలో ముస్కాన్, 68 కిలోల విభాగంలో మాన్సి కాంస్యాలు నెగ్గి భారత్‌కు ఒకే రోజు మూడు పతకాలు అందించారు. 22 ఏండ్ల రీతికా.. సెమీస్‌లో 10-0తో జపాన్ రెజ్లర్ నొడొక్ యమముటొను మట్టి కరిపించి పసిడి పోరుకు అర్హత సాధించింది. హోరాహోరిగా జరిగిన ఫైనల్ పోరులో రీతికా.. 6-7తో కిర్గిస్థాన్ రెజ్లర్ ఐపెరి మెడెట్ చేతిలో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకుంది. ఇక ముస్కాన్.. ఆరంభ బౌట్‌లో అరియన్ (ఫిలిప్పీన్స్)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. క్వార్టర్స్‌లో ఆమె.. జపాన్ రెజ్లర్ సకురా ఒనిషి చేతిలో ఓడినా రెపిచేజ్ ద్వారా కాంస్య పోరుకు దూసుకెళ్లింది. కీలక పోరులో ముస్కాన్.. 4-0తో అల్జిజిన్ (మంగోలియా)ను ఓడించి కాంస్యం సాధించింది. కాంస్య పోరులో మాన్సి.. 12-2తో ఇరినా కజ్యులినా (కజకిస్థాన్)పై టెక్నికల్ సుపిరియారిటీతో గెలిచి పతకం సొంతం చేసుకుంది.

స్వియాటెక్‌కు షాక్

అన్‌సీడెడ్ అలెగ్జాండ్ర సంచలనం

మియామి: టెన్నిస్ ఉమెన్స్ సింగిల్స్ టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్)కు మియామి ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలింది. ఐదుసార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్ అయిన రెండో సీడ్ స్వియాటెక్‌కు టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 2-6, 5-7తో అలెగ్జాండ్ర ఈల షాకిచ్చింది. 19 ఏండ్ల ఈ అన్‌సీడెడ్ ఫిలిప్పీన్స్ సంచలనం.. స్పెయిన్‌లోని రఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతుండటం గమనార్హం. వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా ఈ టోర్నీలోకి అడుగుపెట్టిన అలెగ్జాండ్ర.. స్వియాటెక్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. ఇదే టోర్నీలో ఆమె ఒస్టపెంకొ, మాడిసన్ కీస్‌నూ చిత్తు చేయడం విశేషం. తద్వారా ఫిలిప్పీన్స్ నుంచి టెన్నిస్ ఆడుతూ గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌ను ఓడించిన తొలి క్రీడాకారిణిగా ఆమె రికార్డులకెక్కింది. సెమీస్‌లో అలెగ్జాండ్రా.. జెస్సికా పెగులా (అమెరికా)తో తలపడనుంది. ఇదే టోర్నీ పురుషుల డబుల్స్‌లో ఆడిన భారత ఆటగాడు యుకీ బాంబ్రీ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. క్వార్టర్స్‌లో బాంబ్రీ-బోర్గ్స్ (పోర్చుగల్) ద్వయం.. 6-7 (1/7), 6-3, 2-10తో లాయిడ్ గ్లాస్‌పుల్-జులియన్ (యూకే) చేతిలో ఓడింది.

కోచింగ్ సిబ్బంది కుదింపు?

- అభిషేక్, దిలీప్‌పై వేటు!

ముంబై: భారత క్రికెట్ జట్టు కోచింగ్ సిబ్బందిని బీసీసీఐ కుదించనుందా? జూన్ నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే ఐదు టెస్టుల సిరీస్ నుంచి హెడ్ కోచ్ గౌతం గంభీర్ స్టాఫ్‌లో పలువురు కోచ్‌లకు ఉద్వాసన పలుకనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. జాతీయ మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం.. ప్రస్తుతం గంభీర్ కోచింగ్ స్టాఫ్‌లో అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న అభిషేక్ నాయర్‌తో పాటు ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌పై వేటు పడే అవకాశం ఉన్నట్టు సమాచారం. శనివారం (మార్చి 29న) గువహటిలో జరుగబోయే బీసీసీఐ సమావేశంలో దీనిపై చర్చించనున్నట్టు తెలుస్తున్నది. బ్యాటింగ్ కోచ్‌గా ఇప్పటికే సితాన్షు కోటక్ ఉండగా అభిషేక్ అవసరం లేదన్న భావనలో బోర్డు ఉండగా దిలీప్ స్థానాన్ని మరో అసిస్టెంట్ కోచ్ రియాన్ డస్కటే నిర్వర్తించే అవకాశమున్నట్టు వినికిడి. మరి దీనికి గంభీర్ ఆమోదం తెలుపుతాడా? అనేది ఆసక్తికరం. కోచ్‌ల కుదింపుతో పాటు ఆట గాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులపైనా ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

రెండో రౌండ్‌కు శరత్

చెన్నై: తన కెరీర్‌లో ఆఖరి టోర్నీ ఆడుతున్న భారత టేబుల్ టెన్నిస్ దిగ్గజం ఆచంట శరత్ కమాల్.. టైటిల్ వేటను విజయంతో ప్రారంభించాడు. చెన్నై వేదికగా గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో శరత్.. 3-0తో అనిర్బన్ ఘోష్‌ను ఓడించి రెండో రౌండ్‌కు చేరాడు. పురుషుల డబుల్స్‌లో శరత్-స్నేహిత్ ద్వయం.. 3-2తో లుమ్-లూ (ఆస్ట్రేలియా) జోడీని ఓడించి క్వార్టర్స్‌లో ప్రవేశించింది.

రైజర్స్‌కు ఝలక్

లక్నో చేతిలో ఓటమి • శార్దుల్, పూరన్ విజృంభణ

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఝలక్! సొంతగడ్డపై తమకు తిరుగులేదనుకున్న రైజర్స్‌కు లక్నో సూపర్‌జెయింట్స్ షాక్ ఇచ్చింది. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తుచేసిన హైదరాబాద్..లక్నో చేతిలో ఓటమిపాలైంది. శార్దుల్ ఠాకూర్ ధాటికి 190 పరుగులకు పరిమితమైన హైదరాబాద్..లక్నోను నిలువరించలేకపోయింది. నికోలస్ పూరన్, మిచెల్ మార్ష్ అర్ధసెంచరీలతో లక్నో తొలి విజయాన్ని ఖాతాలో వేసుకుంది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చుక్కెదురైంది. గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో లక్నో చేతిలో ఓడింది. తొలుత శార్దుల్ ఠాకూర్(4-34) ధాటికి రైజర్స్ 20 ఓవర్లలో 190-9 స్కోరు చేసింది. హెడ్(47), అనికేత్(36), నితీశ్‌కుమార్(32) రాణించారు. లక్ష్యఛేదనలో లక్నో 16.1 ఓవర్లలో 193-5 స్కోరు చేసింది. నికోలస్ పూరన్(26 బంతుల్లో 70, 6ఫోర్లు, 6సిక్స్‌లు), మార్ష్(31 బంతుల్లో 52, 7ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో జట్టును గెలిపించారు. కమిన్స్(2-29) రెండు వికెట్లు తీశాడు. శార్దుల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పూరన్ (70)

పూరన్ వీరవిహారం:

లక్ష్యఛేదనలో లక్నోకు మెరుగైన శుభారంభం దక్కలేదు. షమీ రెండో ఓవర్‌లోనే మార్క్‌రమ్(1).. కమిన్స్ క్యాచ్‌తో ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన పూరన్.. మార్ష్‌కు జతకలవడంతో అగ్నికి వాయువు తోడైనట్టైంది. వీరిద్దరూ రైజర్స్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టారు. ముఖ్యంగా సూపర్ ఫామ్‌లో ఉన్న పూరన్ అయితే పూనకమొచ్చినట్టు ఊగిపోయాడు. సిమర్‌జీత్ 3వ ఓవర్‌లో ఓ ఫోర్, రెండు సిక్స్‌లతో 17 పరుగులు పిండుకున్నాడు. మరో ఎండ్‌లో మిచెల్ కూడా సిక్స్‌లు బాదడంతో లక్నో లక్ష్యం వైపు సాఫీగా సాగింది. అభిషేక్‌ను లక్ష్యంగా చేసుకున్న మార్ష్ ఒక ఫోర్ కొడితే పూరన్ రెండు సిక్స్‌లు ఖాతాలో వేసుకున్నాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి లక్నో వికెట్ నష్టానికి 77 పరుగులు చేసింది. సిక్స్‌తో 18 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పూరన్.. అదే ఊపులో సిక్స్, ఫోర్ దంచాడు. ఇన్నింగ్స్ టాప్‌గేర్‌లో దూసుకెళుతున్న సమయంలో బౌలింగ్‌కు వచ్చిన కమిన్స్.. పూరన్‌ను ఎల్బీ చేసి రెండో వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ వేశాడు. తన తర్వాతి ఓవర్లో కమిన్స్.. మార్ష్‌నూ పెవిలియన్‌కు పంపాడు. కానీ అప్పటికే లక్నో విజయం దాదాపు ఖాయమైంది. బదోని (6), పంత్ (15) వెనుదిరిగినా గత సీజన్ దాకా హైదరాబాద్‌కు ఆడిన అబ్దుల్ సమద్ (8 బంతుల్లో 22 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), డేవిడ్ మిల్లర్ (13 నాటౌట్) అండతో లక్నోను విజయతీరాలకు చేర్చాడు.

శార్దుల్ (4/34)

రాణించిన హెడ్, అనికేత్:

తొలుత టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్.. హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆతిథ్య జట్టు ఫామ్ చూస్తే ఎవరూ చేయని సాహసం పంత్ చేశాడని అంతా భావించారు. కానీ తమ బౌలర్లపై నమ్మకం పెట్టుకున్న పంత్.. హైదరాబాద్‌ను ఆదిలోనే దెబ్బతీయడంలో సఫలమయ్యాడు. మొదటి నుంచే బౌలర్లపై తనదైన శైలిలో నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడే అభిషేక్‌శర్మ(6)ను శార్దుల్ తొలి వికెట్‌గా సాగనంపాడు. ఆ మరుసటి బంతికే గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఇషాన్ కిషన్(0) గోల్డెన్ డకౌట్‌గా నిష్క్రమించాడు. దీంతో ఎస్‌ఆర్‌హెచ్ 15 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ దశలో హెడ్, నితీశ్‌కుమార్ జట్టును ఆదుకున్నారు. అవేశ్‌ఖాన్ వేసిన ఇన్నింగ్స్ 4వ ఓవర్‌లో హెడ్ రెండు భారీ సిక్స్‌లకు తోడు ఫోర్‌తో గేర్ మార్చాడు. రెండుసార్లు ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న హెడ్‌ను ప్రిన్స్ యాదవ్ 8వ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేయడంతో 61 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇక్కణ్నుంచి ఇన్నింగ్స్ ఒకింత మందగించింది. ప్రిన్స్ 12వ ఓవర్ చివరి బంతికి షాట్ ఆడిన నితీశ్ బంతి బౌలర్ చేతికి తగిలి వికెట్లను గిరాటేయడడంతో క్లాసెన్(26) వెనుదిరుగాల్సి వచ్చింది. మరోమారు బౌలింగ్ వచ్చిన బిష్ణోయ్..నితీశ్‌ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో రైజర్స్ ఫ్యాన్స్ ఉసూరుమన్నారు. ఓవైపు వికెట్లు పడుతున్నా..అనికేత్‌వర్మ రెండు భారీ సిక్స్‌లతో ఇన్నింగ్స్ ఊపు తీసుకొచ్చాడు. ఇదే దూకుడుతో దిగ్వేశ్‌ను రెండు సిక్స్‌లు అరుసుకున్న అనికేత్..మిల్లర్ చేతికి చిక్కాడు. అభినవ్ మనోహర్ (2) మరోమారు నిరాశపర్చగా, ఆఖర్లో కెప్టెన్ కమిన్స్(18) హ్యాట్రిక్ సిక్స్‌లతో చెలరేగగా రైజర్స్ స్కోరుకు కీలక పరుగులు జతకలిశాయి. హర్షల్ (12), సిమర్‌జిత్‌సింగ్(3) నాటౌట్‌గా నిలిచారు.

సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 20 ఓవర్లలో 190-9(హెడ్ 47, అనికేత్ 36, శార్దుల్ 4-34, ప్రిన్స్ యాదవ్ 1-29), **లక్నో:** 16.1 ఓవర్లలో 193/5 (పూరన్ 70, మార్ష్ 52, కమిన్స్ 2/29, హర్షల్ 1/28)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
బెంగళూరు	1	1	0	2	2.13
లక్నో	2	1	1	2	0.96
పంజాబ్	1	1	0	2	0.55
చెన్నై	1	1	0	2	0.49
ఢిల్లీ	1	1	0	2	0.37
హైదరాబాద్	2	1	1	2	-0.12
కోల్‌కతా	2	1	1	2	-0.30
ముంబై	1	0	1	0	-0.49
గుజరాత్	1	0	1	0	-0.55
రాజస్థాన్	2	0	2	0	-1.88

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

తమన్ తీన్మార్!

ఉప్పల్ స్టేడియంలో మ్యూజికల్ షో

హైదరాబాద్, లక్నో మ్యాచ్‌కు ముందు ఉప్పల్ స్టేడియంలో టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ తమన్ ఆధ్వర్యంలో అదిరిపోయే మ్యూజిక్ షో జరిగింది. రైజర్స్ అభిమానులను అలరిస్తూ తమన్ సూపర్ హిట్ పాటలతో దుమ్మురేపాడు. ఫ్యాన్స్‌లో కొత్త జోష్ నింపుతూ తమన్ పాటిన పాటలకు స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది. హిట్ సాంగ్స్‌కు స్టాండ్స్‌లో ఉన్న ఫ్యాన్స్ డ్యాన్స్ చేస్తూ హంగామా చేశారు. ప్రత్యేకమైన వాహనంలో స్టేడియం మొత్తం కలియ తిరుగుతూ తమన్ అభిమానులను అలరించాడు. మొత్తంగా దాదాపు అర్ధగంట పాటు సాగిన మ్యూజికల్ షో ఉప్పల్ స్టేడియానికి కొత్త అందాన్ని తీసుకొచ్చింది. షో జరుగుతున్నంత సేపు స్టేడియంలో కండ్లు మిరుమిట్లు గొలిపే రీతిలో లైట్లు ఏర్పాటు చేశారు.